క్లుప్తంగా

కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన శ్రీ కోనా వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం స్వామివారికి ప్రియమైన రోజు కావడంతో కొండపై ఆలయంలోని భూదేవి, అలివేలిమంగమ్మ సమేత శ్రీ కోనా వెంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి



బురాన్‌దొడ్డి లేఅవుట్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ సుమంత్

సి.బెళగల్: మండలంలోని హౌసింగ్ లబ్ధిదారులు గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని, ఈ మేరకు హౌసింగ్ సిబ్బంది, వలంటీర్లు కృషి చేయాలని హౌసింగ్ ఏఈ సుమంత్ సూచించారు. శనివారం వారు హౌసింగ్ సిబ్బందితో కలిసి మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామంలో పర్యటించి, లబ్ధిదారులకు గృహ నిర్మాణాలపై అవగాహన కల్పించారు. కాగా నిర్మాణదశ ప్రారంభం చేయని వాళ్ల ఇళ్లను బేసిమట్టం దశలోకి వచ్చేలా చూసుకోవాలని, లేదంటే థర్డ్ పార్టీ నిర్మాణాలకు ముందుకు రావాలని సూచించారు. నిర్మాణాలపై నిర్లక్ష్యం చేసే లబ్ధిదారుల అనుమతులు రద్దు అవుతాయని తెలిపారు. హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రంగన్న, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.


ప్రైవేటీకరణ అడ్డుకుందాం



ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

కల్లూరు: దేశంలో జరుగుతున్న విద్యా కాషాయకారణ, కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణలను అడ్డుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శరత్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కల్లూరు ఎస్టేట్‌లోని మైనార్టీ కళాశాలలో పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్‌లోని లక్నో నగరంలో ఏఐఎస్ఎఫ్ అవిర్భవించిందన్నారు. దేశంలో ఉన్న విద్యార్థులను ఏకతాటికైకి తీసుకొచ్చి బ్రిటీష్ పాలకులపై ఉద్యమాలను నడిపించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు పవన్, స్టాలిన్, అనిల్, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ రంగనాథన్ సేవలు ఎనలేనివి



రంగనాథన్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్, ఉద్యోగులు

కర్నూలు కల్చరల్: గ్రంథాలయ శాస్త్ర పితామహుడిగా డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ అందించిన సేవలు ఎనలేనివని గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో శనివారం రంగనాథన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి గ్రంథాలయ సంస్థ చైర్మన్, గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, పాఠకులు పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. చైర్మన్ మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి రంగనాథన్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. గ్రంథాలయ చట్టాలు రూపకల్పనలో ఆయన ప్రముఖ భూమిక పోషించారన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయ సభ్యత్వం తీసుకొని గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లైబ్రేరియన్ వజ్రాల గోవింద రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

'గో మహా పాదయాత్ర' నేడు కర్నూలుకు రాక

కర్నూలు కల్చరల్: గో రక్షణకు, గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని కోరుతూ హైదరాబాద్ నుంచి అరుణా చలం వరకు పాద యాత్ర చేస్తున్న బాలకృష్ణ గురుస్వామి చేపట్టిన 'గో మహా పాదయాత్ర' ఆదివారం ఉదయం కర్నూలుకు చేరుకోనుంది. ఈ విషయాన్ని పాద యాత్ర నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు బాలాజీ నగర్ షిర్డీ సాయిబాబా దేవాలయం నుంచి వీఆర్ కాలనీ, సీతారాం నగర్, కొత్త బస్టాండ్, బళ్లారిచౌరస్తా, చెన్నమ్మ సర్కిల్ మీదుగా కల్లూరు ఎస్టేట్‌లోని అవధూత రామిరెడ్డి తాత గోశాలకు చేరుకుంటుందని పేర్కొన్నారు.

మొక్క మధురం..ఎగుమతులు ఘనం

పాణ్యం నర్సరీల్లో తల్లిఅంటు మామిడి మొక్కలు లభ్యం

- ఆరోగ్యకర మొక్కలుగా ప్రసిద్ధి
- ఆసక్తి చూపుతున్న మామిడి తోటల సాగు రైతులు
- పాణ్యం నుంచి కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు ఎగుమతి
- వర్షాల రాకతో ఊపందుకున్న విక్రయాలు



తల్లిఅంటుతో పెంచుతున్న మామిడి మొక్కలు



ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న మామిడి మొక్కలు

పాణ్యం: పండ్లలో రారాజు మామిడి. అలాంటి పండ్ల మొక్కలకు పాణ్యం కేరాఫ్‌గా నిలుస్తోంది. తల్లి అంటు పేరుతో లభించే ఈ మొక్కలకు మార్కెట్‌లో మంచి డిమాండ్. కొత్తగా మామిడి తోటలు సాగు చేయాలనుకునే రైతులు కొన్ని నెలల ముందే ఇక్కడి నర్సరీల యజమానులకు కలిసి బుకింగ్ చేసుకుంటారు. అంతలా ఇక్కడి మొక్కలు ప్రసిద్ధి చెందాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో తల్లి అంటు మామడి మొక్కల విక్రయాలు ఊపందుకున్నాయి.

పాణ్యంలో 1885లో నర్సరీల ప్రారంభమయ్యాయి. దాదాపుగా వంద ఎకరాల్లో నర్సరీల సాగవుతున్నాయి. ఇందులో 40 ఎకరాలకు పైగా మామిడి మొక్కలే సాగు చేస్తుండటం గమనార్హం. మూడు నెలల నుంచే నర్సరీ రైతులు మొక్కలను తెచ్చి తల్లి అంటుకు కట్టుతారు. తర్వాత అక్కడే మూడు నెలలు పెంచి రైతులకు అందిస్తారు.

తల్లి అంటుతో మొక్క ఆరోగ్యం

పాణ్యంలోని రైతులు వేసవి కాలంలో మొలకను తెచ్చి మూడు నెలల పాటు తమ పొలంలో ఉన్న తల్లి మొక్కకు అంటు కడతారు. ఇలా మూడు నెలల పాటు తల్లి, పిల్లమొక్కలను పెంచుతారు. దీనినే అప్రోచ్ గ్రాఫ్టింగ్ మొక్క అంటారు. ఇలా మొక్కలను అంటు కట్టడం వలన భవిష్యత్‌లో ఎలాంటి తెగుళ్ల వచ్చినా వాటిని తట్టుకుని నిలబడే శక్తి తల్లిమొక్క నుంచి పిల్లమొక్కకు లభిస్తుంది. దీంతో పాటు ఎలాంటి నేలలోనైనా ఈ మొక్క బతుకుతుంది. నీటి సౌకర్యం కొద్దిగా ఆలసమైనా తట్టుకునే శక్తి ఉంటుంది. 4-5 సంవత్సరాల నుంచే దిగుబడులు ప్రారంభమవుతాయి. అందుకే మామిడి సాగు రైతులు ఈ మొక్కల కొనుగోలుకు ఆసక్తి చూపుతారు. ఇక్కడి మొక్కలు ఎక్కువగా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు ఎగుమతి అవుతాయి.

బేనిషాకే ప్రాధాన్యత

మామిడి పండ్లలో అమృతం, బేనిషా, బంగినపల్లి పండ్లు అంటే ఇష్టపడనివారు ఉండరు. మామిడి తోట సాగు చేయాలనేకునే రైతులు 90 శాతం బేనిషా రకం తీసుకెళ్తారు. మిగిలిన 10శాతం అమృతం, అచారి, నీలం రకాలను నాటుకుంటారు. వీటితో పాటు రెడ్డిపసంద్, బంగినపల్లి, ఇమాయత్, దషేరి, మల్గోవా మొక్కలను రైతులు నాటుకుంటారు. ఎకరం పొలంలో 40-70 మొక్కల వరకు రైతులు నాటుకుంటారు.

ఏటేటా పెరుగుతున్న విక్రయాలు

ఉద్యాన పంటల సాగును రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. దీంతో రాష్ట్రంలో ఏటేటా పండ్ల తోటల సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఇందులో అత్యధికంగా మామిడి సాగవుతుంది. రెండేళ్ల క్రితం వరకు పాణ్యంలో ఏడాదికి లక్ష మొక్కల విక్రయాలు జరిగేవి. గతేడాది ఏకంగా లక్షన్నర మొక్కలను విక్రయించారు. ఈ ఏడాది రెండు లక్షల వరకు విక్రయాలు జరిగే అవకాశం ఉందని, నర్సరీ రైతుల అంచనా. మంచి ఆరోగ్యకరమైన మొక్క పాణ్యంలో రూ.100-120 వరకు పలుకుంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు పూర్తి స్థాయి సహకారం అందిస్తోంది. మొక్కల రవాణా ఖర్చులను సైతం సర్కారే అందిస్తుండటంతో రైతులకు ఆర్థికంగా ఎంతో ఉపశమన కలుగుతోంది.

20 వేల మొక్కలు పెంచాను



ఈ ఏడాది నేను 20 వేల మొక్కలను పెంచాను. రైతులు ముందుగానే ఫోన్ చేసి బుక్ చేసుకుంటున్నారు. మొలకను తెచ్చి మూడు నెలల పాటు తల్లి అంటుకు కట్టి సాగు చేస్తాం. ఇలా చేయడం వలన మొక్క ఎలాంటి తెగుళ్ల సోకినా తట్టుకోగలుగుతుంది. అంతేకాక ఎలాంటి భూమిలోనైన బతుకుతుంది. మొక్క కాండం కూడా లావుగానే ఉంటుంది. అంటుకట్టిన మూడు నెలల తర్వాతనే రైతులకు అందిస్తాం. అధికంగా బేనిషా, అమృతం, బంగినపల్లి మొక్కలను రైతులు కోరుకుంటారు. గత ఏడాది నేను 15వేల మొక్కలను పెంచి విక్రయించాను.

– జంపాల సుధాకర్

నర్సరీలకు లైసెన్స్‌లు

మామిడి మొక్కలు పెంచే నర్సరీలకు లైసెన్స్‌లు ఇస్తున్నాం. రైతులు ఎవరైనా నర్సరీల్లో మొక్కలు కొంటే బిల్లులు ఇచ్చేలా చర్యలు తీసుకున్నాం. ఏదైనా మొక్కకు డ్యామేజి జరిగితే నర్సరీ రైతులే మరో మొక్క ఇస్తారు. ఇక్కడ విక్రయించే మొక్కలు ఆరోగ్యకరంగా ఉంటాయి. సరైన పద్ధతుల్లో వాటిని నాటుకుంటే మంచి దిగుబడులు వస్తాయి. అలాగే 5 ఎకరాల్లోపు ఉన్న రైతులు మామిడి తోటల సాగు చేపడితే ఉపాధి హామీ పథకం కింద రూ. లక్ష వరకు రాయితీ ఇస్తున్నాం. జామ, నేరేడు, నిమ్మ, చీని తదితర పంటలకు కూడా ప్రభుత్వం రాయితీ ఇస్తుంది.

– దివ్య, మండల ఉద్యాన అధికారి

నామినేషన్ల పరిశీలన పూర్తి

కోడుమూరు రూరల్ : మండలంలోని గోరంట్ల గ్రామంలో వార్డుమెంబర్-6, ప్యాలకుర్తి గ్రామంలోని వార్డు మెంబర్-1 స్థానాలకు అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ల పరిశీలన పూర్తయినట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ శనివారం తెలిపారు. నామినేషన్ల పరిశీలనలో గోరంట్ల వార్డు మెంబర్ స్థానానికి దాఖలు చేసిన 3 నామినేషన్లు, ప్యాలకుర్తి వార్డు మెంబర్ స్థానానికి దాఖలు చేసిన 2 నామినేషన్లు నిబంధనల ప్రకారం అన్ని పత్రాలు కరెక్ట్‌గా ఉన్నట్లు చెప్పారు. ఎన్నికల షెడ్యూల్‌లో భాగంగా ఈనెల 14వ తేదీ సోమవారం నామినేషన్ల విత్‌డ్రా ఉంటుందని, బరిలో ఉన్న అభ్యర్థులకు ఈనెల 19వ తేదీ ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు.

ఇంటింటి సర్వే పరిశీలన

గూడూరు : ఓటరు జాబితా సవరణపై శనివారం పట్టణంలో బీఎల్‌ఓలు చేపట్టిన ఇంటింటి సర్వేను తహసీల్దార్ శివశంకర్ నాయక్ పరిశీలించారు. ఈ నెల 21 కంతా ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ముగించాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. ఈ మేరకు బీఎల్‌ఓలు సెలవు రోజుల్లో కూడా పని చేస్తున్నారు. పట్టణంలో తహసీల్దార్ పర్యటించి బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు.

'సుంకేసుల'లో 0.990 టీఎంసీల నీరు

గూడూరు: సుంకేసుల జలాశయంలో 0.990 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డ్యాం అధికారులు వనివారం నాడు తెలిపారు. ఇన్ ఫ్లో నిలిచి పోయిందని, కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం 130 క్యూ సెక్కుల నీటిని విడుదల చేశామన్నారు.

చిరు ప్రాణం.. క్యాన్సర్‌తో నరకం

- రక్తక్యాన్సర్‌తో పోరాటం చేస్తున్న కరిమద్దల బాలిక జయలక్ష్మి
- ఆర్థిక సమస్యతో చికిత్స చేయించేందుకు ఇబ్బంది పడుతున్న తల్లిదండ్రులు
- ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు



కరిమద్దెల జయలక్ష్మితో తల్లిదండ్రులు

గడివేముల: తన ఈడు పిల్లలందరూ ఆటపాటలతో చలాకీగా ఉండడం చూసి ఆ బాలికలో ఏదో ఆందోళన. భవిష్యత్తులో మీరు ఏమవుతారని తరగతిలో టీచర్ పిల్లల్ని అడుగుతుంటే.. ఒకరేమో ఇంజినీర్ అని మరొకరు డాక్టర్ అని చెబుతుంటే ఆ చిన్నారి కంటి వెంట అశ్రుధారలు. తనకూ జీవితంపై ఎన్నో ఆశలు, కోరికలు ఉన్నా నిత్యం వెంట తిరుగుతున్న మత్యువు ఇవన్నీ చెల్లవు అంటూ హెచ్చరిస్తూ ఉంటుంది. మరి లేత మనసు ఎంత నరకాన్ని అనుభవిస్తూ ఉంటుందో?.

ఆదుకోండంటూ తల్లిదండ్రుల వేడుకోలు...

గడివేముల మండలం కరిమద్దల కు చెందిన తిమ్మాపురం సామన్న, రమాదేవి దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు సంతానం. వీరిలో జయలక్ష్మి అందరికన్నా చిన్నది. 2013లో జన్మించిన ఈ బాలిక మొదట్లో అందరి పిల్లలాగే ఆరోగ్యంగా ఉంటూ ఏ చీకూ చింతా లేకుండా ఉండేది. కానీ 2018లో ఒంట్లో నలతగా ఉండటంతో తల్లిదండ్రులు దగ్గర్లోని ఆసుపత్రిలో చికిత్స చేయించారు. కొన్నిరోజుల బాగున్నా...అనారోగ్యం తిరగబెట్టడంతో కర్నూలులో చూపించారు. అక్కడి వైద్యులకు అనుమానం వచ్చి హైదరాబాద్ లోని ఎంఎన్‌జే ఆసుపత్రికి సిఫారసు చేశారు. అక్కడ పరీక్షల అనంతరం పాపకు అక్యూట్ లింపోబ్లాస్టిక్ ల్యూకేమియా (బ్లడ్ క్యాన్సర్) ఉందని తేల్చారు. దీంతో ఆ కుటుంబం తీవ్ర వేదనలో మునిగిపోయింది. నాటినుంచి పాపను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. వ్యాధి పర్యావసానాలతో అకస్మాత్తుగా పాపకు రక్త హీనత ఏర్పడుతోంది. దీంతో తీవ్ర జ్వరం బారిన పడుతూ ప్రత్యక్ష నరకం చూస్తోంది. కడు పేద కుటుంబం కావటంతో తినటానికే అవస్థలు పడుతున్న వారు నెలవారీగా మందులు, చికిత్సకు అయ్యే మొత్తాన్ని భరించలేక బేల చూపులు చూస్తున్నారు. నెలకు రూ.4 వేల నుంచి రూ.5 వేల దాకా ఖర్చు అవుతోంది. ఇప్పటి వరకు ఎలాగోలా నెట్టుకు వచ్చామని, కుటుంబ పోషణే భారంగా మారిన తమకు పాపను బతికించుకోవాలని ఆశ ఉన్నా సాధ్యం కావట్లేదని విలపించారు. ఒక్కోసారి తమ నిస్సహాయతతో జీవితంపైనే విరక్తి కలుగుతోందని, కానీ మిగతా పిల్లల కోసం ఏ అఘాయిత్యానికి పాల్పడకుండా ఉంటున్నామంటూ చెప్పడం పలువురిని కంటతడి పెట్టిస్తోంది. దాతలు ముందుకొచ్చి తలా ఓ చెయ్యి వేసి తమను ఆదుకోవాలని వారు అర్థిస్తున్నారు. సాయం చేయాలనుకునే వారు 9642567917 నంబరుకు ఫోన్ చేయాలని కోరుతున్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- నాయకల్లులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



వృద్ధుడికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రాజకీయాలు, పార్టీలు, వర్గాలు, కులాలు, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం నాయకల్లు గ్రామంలో వైఎస్ ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ సరిత ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు గ్రామ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన గ్రామంలో విస్తృతంగా పర్యటిస్తూ వృద్ధులను, మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ.. సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయలన్నారు. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజా ప్రతినిధులందరం గడప గడపకు వస్తున్నామన్నారు. ప్రభుత్వం అందించే పథకాలను వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సకాలంలో తెలియజేస్తున్నారా? లేదా ? అని ఆరా తీశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో చెప్పిన వాటితో పాటు చెప్పనవి కూడా చేశామన్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా రాష్ట్రంలో పాలన సాగుతోందని ఎమ్మెల్యే అన్నారు. పథకాలు అందించడంలో మధ్యవర్తులు, దళారులు లేకుండా పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాలోనే జమ చేస్తున్నామన్నారు. అవినీతి రహితంగా ప్రజా జనరంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కేశవరెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, సాపేస్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధిపై దృష్టి సారించండి



శిక్షణ సర్టిఫికెట్లు పొందిన యువతతో నిర్వాహకులు

కర్నూలు కల్చరల్ : నిరుద్యోగ యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలని లయన్స్ జిల్లా అడిషనల్ కేబినెట్ సెక్రటరీ లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్, ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ టెక్నాలజీల సంయుక్త ఆధ్వర్యంలో వెంకటరమణ కాలనీలోని నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో అంతర్జాతీయ యువజన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ స్వయం ఉపాధి శిక్షణలో భాగంగా యువతకు తెలుగు డీటీపీ, టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 30 సంవత్సరాల లోపు వారు ఈ శిక్షణకు అర్హులన్నారు. ఈనెల 14వ తేదీ లోపు ఆసక్తి ఉన్న వారు తమ పేర్లను వీఆర్ కాలనీ మొదటి లైన్‌లో ఉన్న నైస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9396861308 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినీ, విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్ సభ్యులు గోవర్ధనగిరి, చిన్నస్వామి, రాయపాటి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఎక్సైజ్ సీఐ మృతి



ఖాజా మొయినుద్దీన్ (ఫైల్)

కర్నూలు: జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తున్న ఖాజా మొయినుద్దీన్ అలియాస్ మున్నా (58) అనారోగ్యంతో కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మధ్యాహ్నం మృతిచెందారు. ఈయన కర్నూలులోని ప్రకాష్ నగర్‌లో నివాసముంటున్నారు. కొన్నేళ్లుగా త్రోట్ క్యాన్సర్‌తో బాధ పడుతుండేవాడు. ఈయన భార్య కూడా ఐదేళ్ల క్రితం గర్భాశయ క్యాన్సర్‌తో మృతిచెందింది. ఈయన 1984లో కానిస్టేబుల్ హోదాలో ఎక్సైజ్ శాఖలో చేరి అంచెలంచెలుగా సీఐ స్థాయికి ఎదిగాడు. కొన్నాళ్లపాటు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో సుంకేసుల చెక్‌పోస్టులో విధులు నిర్వహించారు. క్యాన్సర్ జబ్బు తీవ్రం కావడంతో సెబ్ నుంచి మళ్లీ ఎక్సైజ్‌కు బదిలీ చేయించుకుని ప్రొద్దుటూరు ఐఎంఎల్ డిపోలో చేరి కర్నూలు అటాచ్‌మెంట్ కింద విధులు నిర్వహించేవారు. జబ్బు ముదిరిపోవడంతో హైదరాబాద్‌లో కూడా చికిత్స పొందాడు. అయినప్పటికీ తగ్గకపోవడంతో నెల రోజులుగా ఇంటి వద్దనే ఉంటూ కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం కోలుకోలేక మృతిచెందాడు. ఈయనకు ఇద్దరు కుమారులు సంతానం. సీఐ మరణ వార్త తెలిసిన వెంటనే కర్నూలు ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావుతో పాటు పలువురు సహోద్యోగులు ఇంటి వద్దకు చేరుకుని నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

యువతతోనే దేశాభివృద్ధి



కాలేజీ ఆవరణలో మొక్క నాటే కార్యక్రమంలో పాల్గొన్న సెట్కూరు సీఈఓ రమణ, తదితరులు

కర్నూలు సిటీ: యువతతోనే దేశ అభివృద్ధి జరుగుతుందని, మహనీయుల అడుగు జాడల్లో యువతీ, యువకులు నడవాలని సెట్కూరు సీఈఓ పి.వి. రమణ అన్నారు. శనివారం స్థానిక శ్రీసాయి క్రిష్ణ డిగ్రీ కాలేజీలో అంతర్జాతీయ యువజన దినోత్సవం, నా భూమి -నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా యువతకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. శ్రీసాయి క్రిష్ణ డిగ్రీ కాలేజీ అకడమిక్ అడ్వైజర్ పి.గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర సమయ యోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. అనంతరం యువతకు చిత్రలేఖనం, వ్యాస రచన పోటీలు నిర్వహించి, కాలేజీ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆ కాలేజీ ప్రిన్సిపాల్ జానీ బాషా, అకడమిక్ డైరెక్టర్ రోశిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ కేంద్రాల ద్వారా పత్తి కొనుగోలు చేయాలి

కర్నూలు(రూరల్): గత సంవత్సరం పండిన పత్తిని సీసీఐ కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని కార్మిక, కర్షక భవనంలో ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలి

కర్నూలు(రూరల్): అంగన్ వాడీ వర్కర్లకు పని భారం తగ్గించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ కోరారు. శనివారం నగరంలోని కార్మిక, కర్షక భవనంలో కర్నూలు అర్బన్, కోడుమూరు ప్రాజెక్టుల అంగన్ వాడీ వర్కర్స్ విస్తృత స్థాయి సమావేశం ప్రాజెక్ట్ కార్యదర్శి రేణుక అధ్యర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ... కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రతి సంవత్సరం బడ్జెట్ నిధుల్లో కోత విధిస్తూ ఐసీడీఎస్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు గోపాల్, కర్నూలు అర్బన్ ప్రాజెక్ట్ కార్యదర్శి విజయ కుమారి, సరళ, వెంకట లక్ష్మి, విజయ లక్ష్మి, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం

కర్నూలు(రూరల్): విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటాలు కొనసాగించనున్నట్లు ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు మురళీధర్ తెలిపారు. శనివారం నగరంలోని సీఆర్ భవనంలో ఏఐఎస్ఎఫ్ 88వ అవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు మునెప్ప, నాగరాజు, శ్రీనివాసులు, సీపీఐ నగర అధ్యక్షుడు రామకృష్ణా రెడ్డి ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమలో జిల్లా కార్యదర్శి శ్రీరాములు గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు శరత్ కుమార్, నగర అధ్యక్ష, కార్యదర్శులు చంటి, మునిస్వామి, అశోక్ మాబు, రాజశేఖర్, సీపీఐ నాయకులు మహేష్, అంజి, బీసన్న, బాబయ్య, రాము, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోడుమూరు రూరల్ : మండలంలోని వెంకటగిరి గ్రామ సమీపంలో కంపచెట్లలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను దాడి చేసి పట్టుకున్నట్లు కోడుమూరు ఎస్‌ఐ శ్రీనివాసులు శనివారం తెలిపారు. దాడిలో వెంకటగిరికి చెందిన బోయ కృష్ణ, వర్కూరుకు చెందిన దస్తగిరి, అయ్యన్న, హనుమంతు, వెంకటస్వామి, ఆర్ఎస్.పెండేకల్ చెందిన దస్తగిరి, బోయ మహేష్‌లు పేకాట ఆడుతూ పట్టుబడగా, వారి వద్ద నుంచి రూ.30,080లను, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు వెల్లడించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



అమడగుంట్ల హైస్కూల్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

కోడుమూరు రూరల్ : మండలంలోని అమడగుంట్ల హైస్కూల్‌కు చెందిన హెచ్ఎం అనంతయ్య, ఉపాధ్యాయులు మురళీకృష్ణ గౌడ్, చంద్రమోహన్ నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష కోసం సన్నద్ధమవుతున్న విద్యార్థులకు శనివారం ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. హెచ్ఎం మాట్లాడుతూ నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో ఉత్తీర్ణులైతే 4సంవత్సరాల పాటు ఏడాదికి రూ.12వేల చొప్పున విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందుతుందన్నారు. ఈ స్కాలర్‌షిప్ పరీక్ష కోసం సెప్టెంబర్ 15లోగా ఆన్‌లైన్‌లో 8వ తరగతి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని, డిసెంబర్ 3వ తేదీ పరీక్ష ఉంటుందన్నారు. తమ హైస్కూల్ నుంచి స్కాలర్‌షిప్ పరీక్షకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులకు ముగ్గురు ఉపాధ్యాయులం కలిసి ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను కొని అందజేసినట్లు వెల్లడించారు.

అందుబాటులో శస్త్ర చికిత్స ప్రసవాలు

ఓర్వకల్లు: మండల కేంద్రమైన ఓర్వకల్లు సామాజిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు అత్యవసరమైతే శస్త్ర చికిత్సల (సిజేరియన్) ద్వారా ప్రసవాలు చేసే వెసులుబాటు అందుబాటులోకి వచ్చిందని ఆసుపత్రి వైద్యాధికారిణి డాక్టర్ మంజుల శనివారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గర్భిణులు పురిటి నొప్పులతో బాధపడుతూ, గడుపులో వున్న బిడ్డకు ప్రమాదకర పరిస్థితి తలెత్తినప్పుడు అత్యవసర పరిస్థితుల్లో శస్త్ర చికిత్సల ద్వారా బిడ్డను బయటకు తీస్తారని తెలిపారు. ఇంత వరకు ఆసుపత్రిలో అందుకు సంబంధించిన పరికరాలు అందుబాటులో లేకపోవడంతో కర్నూలుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే పరిస్థితి వుండేదన్నారు. ప్రస్తుతం నూతనంగా నిర్మించిన ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలకు అవసరమైన పరికరాలు, వైద్యులు అందుబాటులో వుండడం వల్ల ఇప్పటి నుంచి ఓర్వకల్లు ఆసుపత్రిలోనే శస్త్ర చికిత్సల ద్వారా ప్రసవాలు చేయడం జరుగుతుందని తెలిపారు. కావున శస్త్ర చికిత్స అవసరమైన గర్భవతులను ఆసుపత్రికి తీసుకరావాలని సూచించారు. గ్రామీణ నిరుపేద ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ప్రమాదం జరిగితే నష్టపోయేది తల్లిదండ్రులే

- మైనర్ డ్రైవింగ్‌లో పట్టుబడిన వారి తల్లిదండ్రులకు డీఎస్పీ హెచ్చరిక



స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడిన మైనర్లకు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ

కర్నూలు : మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదానికి గురైనా, లేదా ఎదుటివారికి ప్రమాదం తలపెట్టినా నష్టపోయేది తల్లిదండ్రులేనని ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం అన్నారు. రోడ్డు ప్రమాద నివారణ కోసం ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా నగరంలోని రాజ్‌విహార్, సి.క్యాంప్ సెంటర్, ఓల్డ్ ఈద్గా, ఫైవ్‌రోడ్ జంక్షన్ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు మైనర్ డ్రైవింగ్‌పై శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. లైసెన్స్ లేకుండా త్రిబుల్ రైడింగ్‌కు పాల్పడుతూ 14 మంది మైనర్లు పోలీసులకు పట్టుబడ్డారు. వారి వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కింద కేసులు నమోదు చేసి రూ.28,409ను తల్లిదండ్రులకు జరిమానా విధించారు. సాయంత్రం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడిన వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఈ-శ్రామ్‌తో అనేక లాభాలు

కర్నూలు(రాజ్‌విహార్): అసంఘటిత కార్మికులకు ప్రభుత్వం జారీ చేస్తున్న ఈ- శ్రామ్ కార్డులతో ఎన్నో లాభాలు ఉన్నాయని కార్మిక శాఖ కర్నూలు సహాయ అధికారి కేశన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వాలు మంజూరు చేసే అనేక పథకాలకు ఈ కార్డులు ప్రామాణికమని, సమీపంలోని సచివాలయాలు, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకొని వాటిని పొందాలన్నారు.

సేవా లోపం లేకుండా పనిచేయండి

కర్నూలు(రాజ్‌విహార్): వినియోగదారులకు అందించే సేవల్లో లోపం లేకుండా చూడాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు రూరల్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వై. సుబ్బన్న సూచించారు. శనివారం ఆయన స్థానిక పవర్ హౌస్‌లోని తన కార్యాలయంలో కింది స్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల నెలా బిల్లులు చెల్లించే వినియోగదారులపై నిర్లక్ష్యం ప్రదర్శించరాదన్నారు.